క్లుప్తంగా

అండగా నిలిచిన మిత్రులు



రఫికి నగదు అందజేస్తున్న మిత్రులు

బేతంచెర్ల: పట్టణానికి చెందిన టీవీ మెకానిక్ రఫి నెల రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై కాలు ఆపరేషన్ చేయించుకున్నాడు. అతని ఆర్థిక పరిస్థితి దృష్ట్యా 2004లో ఆయనతో కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులు స్పందించారు. మహేష్, సురేంద్ర, హబీబుల్లా, ఎల్లస్వామి, జిలాన్, తిరుపాలు, సుంకన్న, జగన్, సాదిక్, రవి, సురేష్ పోగు చేసి రూ.32 వేల నగదును రఫీకి అందజేశారు. ఆపదలో ఉన్న మిత్రునికి అండగా నిలిచి ఆదర్శంగా నిలిచారు.

పాఠశాలకు కుర్చీల విరాళం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు(2004–05 బ్యాచ్) శనివారం 8 కుర్చీలను విరాళమిచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రంగస్వామి, మనోహర్, అక్బర్, సురేంద్ర చౌదరి, మన్మధుడు, రేవంత్‌రెడ్డి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ వెంకటరామిరెడ్డి

బేతంచెర్ల: ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళిక ప్రకారం చదవాలని డిప్యూటీ ఈఓ వెంకటరామిరెడ్డి పదో తరగతి విద్యార్థులకు సూచించారు. శనివారం మండలంలోని కొలుముల పల్లె జెడ్పీ హైస్కూలును సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత పింగళి వెంకయ్య



వెంకటయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: స్ఫూర్తిప్రదాత పింగళి వెంకయ్య అని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జీఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి అన్నారు. శనివారం పలుకూరు గ్రామంలో పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద ఆచారి మాట్లాడుతూ జాతీయ పతాకం రూపశిల్పి పింగళి వెంకయ్య తెలుగువారు కావడం గర్వకారణమన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ హనుమంతునాయక్

కోవెలకుంట్ల: రౌడీషీటర్ల కదలికపై నిరంతర నిఘా కొనసాగుతుందని కోవెలకుంట్ల సీఐ హనుమంతు నాయక్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ సర్కిల్‌లోని కోవెలకుంట్ల, సంజామల, రేవనూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోక్సోయాక్ట్ కింద కేసు నమోదై రౌడీషీటర్లుగా ఉన్న నిందితులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రవర్తనలో మార్పు తెచ్చుకుని జనజీవనంలో కలిసిపోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్ ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, అనిల్‌కుమార్, రమణయ్య, భూపాలుడు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

డోన్ టౌన్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ మమత సూచించారు. మండలంలోని మల్లెంపల్లె గ్రామంలో శనివారం సాయంత్రం శక్తి టీం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆండ్రాయిడ్ ఫోన్లలో కన్పించే తెలియని వెబ్‌సైట్లను ఓపెన్ చేయరాదన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్ల కూడదని,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శక్తి యాప్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళల రక్షణ చట్టాలు, రోడ్డు భద్రత తదితర అంశాలను వివరించారు.

వానాకాలం.. విద్యుత్‌తో జరభద్రం!

- వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం
- విద్యుత్ తీగలు, మోటార్లతో జాగ్రత్త
- స్టార్టర్లు, విద్యుత్ లైన్లకు స్వీయ మరమ్మతులు వద్దు
- అప్రమత్తతతో ప్రమాదాలు దూరం



కోవెలకుంట్ల రహదారి పక్కనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

అవుకు: వర్షాల రాకతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. పంటల సాగు సమయంలో రైతులు పూర్తిగా పనులపై నిమగ్నమై ఉంటారు. అయితే వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు అవకాశాలు అధికంగా ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇంటి పరిసరాలు, రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్లు, పొలాల్లో తడిసిన స్టార్టర్ల కారణంగా విద్యుదాఘాతాలకు గురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. వర్షా కాలంలో వానలు, గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుంటాయి. పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా కనిపిస్తుంటాయి. వానలు పడే సమయంలో వీటిని గమనించకపోతే ప్రమాదాల భారిన పడటం ఖాయం. పొలాలకు వెళ్లే రైతులూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడిఉన్నాయో లేదో ఒకటికి రెండు సార్లు పరిశీలించుకొని నీళ్లలోకి వెళ్లాలి. స్టార్టర్ బోర్డులు తడవకుండా ఉండేలా చూసుకోవాలి. తడిచిన స్టార్టర్లను ముట్టుకోవడం ప్రమాదకరం. మరోవైపు గ్రామాల్లో చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యనే ఉంటాయి. వాటిలో చాలా వాటికి రక్షణ కంచెలు కూడా ఉండవు. విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల మధ్య ఉండటం, పొలాల్లో వేసిన విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉండడం, ఇళ్లకు సమీపం నుంచే తీగలు వెళ్లడంతో పాటు స్తంభాలు విరిగిపోవడం, ఒరిగిపోయి ఉండడం వంటి కారణాలతో ప్రమాదాలు సంభవిస్తుంటాయి. వీటిపై విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించి ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే ఎలాంటి విద్యుత్ సమస్యలు వచ్చిన వెంటనే విద్యుత్ శాఖ వారికి సమాచారం అందిచాలని చెబుతున్నారు.

ఇవి చేయకూడదు

- వానలో విద్యుత్ స్తంభాలను తాకే ప్రయత్నం చేయకూడదు.
- స్తంభాలను తాకుతూ వెళ్లే టెలిఫోన్, కేబుల్ టీవీ వైర్లను తాకే ప్రయత్నం చేయకూడదు.
- నీటిలో అడుగులు వేసేటప్పుడు అందులో విద్యుత్ తీగలు తెగిపడిపోయినాయో లేదో గమనించి అడుగులు వేయాలి.
- సబ్ స్టేషన్ వంటి ప్రాంతాల్లో రక్షన తీగలకు దూరంగా ఉండాలి.
- తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు. మరమ్మతులు చేయకూడదు.

ఇళ్లలో ఈ జాగ్రత్తలు అవసరం...

- ఫ్రిజ్, వాషింగ్ మెషీన్ వంటి పరికరాల వద్దకు పిల్లలు వెళ్లకుండా చూడాలి.
- నీరు ఉన్న పరికరాల్లో విద్యుత్ పరికరాలు ఉంచకూడదు.
- వర్షపు జల్లులు పడే అవకాశం ఉన్న చోట విద్యుత్ పరికరాలను ఉంచకూడదు.
- చేతులు తడిగా ఉన్నప్పుడు స్విచ్‌లను తాకకూడదు.
- ప్లగ్‌లను స్విచ్‌లు ఆపకుండా తీయకూడదు.
- నిపుణులతో మాత్రమే ఇళ్లకు వైరింగ్ చేయించాలి.
- పరికరాలకు ఉన్న వైర్లను పట్టి లాగకూడదు.

ఇవి ప్రమాదకరం...

- సొంతంగా ఇంటికి వైరింగ్ చేయడం
- ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చెత్తను వేయడం
- అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలను ఎక్కడం
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మల మూత్ర విసర్జన చేయడం
- టెలి, కేబుల్ వైర్లపై దుస్తులు ఆరేయడం.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో ప్రజలు, రైతులు కొంతమేరా అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ తీగల్లో ఏదనా మార్పులు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలి. పొలాల్లో రైతులు ఎక్కువ జాగ్రత్తలు పాటించాలి. స్వీయ మరమ్మతులు చేయకూడదు. ఎల్లప్పుడూ విద్యుత్ శాఖ సిబ్బంది అందుబాటులోనే ఉంటారు.

– పక్కీరయ్య, ట్రాన్స్‌కో ఏఈ, అవుకు మండలం

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు 5న స్పాట్ అడ్మిషన్లు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చక్రవర్తి శనివారం తెలిపారు. పాలిసెట్ తుది దశ కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో మిగిలి ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ విధానంలో భర్తీ చేయనున్నట్లు చెప్పారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పాట్ అడ్మిషన్స్ ద్వార ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ వర్తించదని పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం

డోన్ టౌన్ : కూటమి నాయకులు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆపమని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, మహా సభల ఆహ్వాన సంఘం కార్యదర్శి కౌన్సిలర్ సుంకయ్య ,కోశాధికారి రాధాకృష్ణ, నాయకులు నారాయణ,మోటారాము పేర్కొన్నారు. శనివారం స్థానిక నక్కీరామన్న భవన్‌లో మహాసభల విజయవంతంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ విజయవంతానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నరసింహస్వామి స్వామి సేవలో..



జడ్డి దంపతులకు స్వామి వారి చిత్ర పటాన్ని అందజేస్తున్న ఉపకమిషనర్, ఆలయ ఈఓ

బేతంచెర్ల: మండలంలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని శ్రావణ శనివారం సందర్భంగా కర్నూలు జిల్లా అదనపు జడ్జి కమలాదేవి దంపతులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, వేద పండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి, ఆలయ సిబ్బంది పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో వారికి స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం జడ్జి దంపతులకు తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్ర పటాన్ని అందజేసి సత్కరించారు.

ఘనంగా నాగార్జునరెడ్డి జయంతి



నాగార్జునరెడ్డి ఘాట్ వద్ద వద్ద మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జయమ్మ, ఓబులరెడ్డి

బనగానపల్లె: మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్ద కుమారుడు నాగార్జునరెడ్డి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అవుకు రోడ్డులో ఉన్న కాటసాని నాగార్జునరెడ్డి ఘాట్ వద్ద రామిరెడ్డి, జయమ్మ దంపతులు, వారి చిన్న కుమారుడు ఓబులరెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు అంబటి రవికుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

5 నుంచి ఆన్‌లైన్ పనులు చేయలేం



సీడీపీఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహణకు ఇచ్చిన ఫోన్లు ప్రస్తుత యాప్‌లకు సపోర్ట్ చేయడం లేదని, దీని కారణంగా ఈనెల 5వ తేదీ నుంచి ఆన్‌లైన్ పనులు నిలిపివేస్తున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు షేబారాణి, ప్రాజెక్టు అధ్యక్ష,కార్యదర్శులు జయలక్ష్మి, సులోచనలు, నాయకురాళ్లు రహమత్‌బీ, సుమలత, సుభద్ర తెలిపారు. ఈ మేరకు శనివారం సీడీపీఓ శంషాద్‌బేగంను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లకు తమ ఫోన్లు సహకరించడం లేదని కొత్త 5జీ ఫోన్లు, ట్యాబ్‌లు అందజేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండ పోషకాహార సరుకులు ఒకేసారి రావడం లేదని దీంతో ప్రతిసారి లబ్ధిదారుల ఫోటోలను క్యాప్చర్ చేయడం కుదరదని స్పష్టం చేశారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరారు.

పట్టుదలతో చదవాలి



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత

బనగానపల్లె రూరల్: పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజికసత్యప్రపూర్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్వాగతం కార్యక్రమంలో డాక్టర్ లలితా మాట్లాడారు. విద్యార్థులకు ఇంటర్ విద్య ఎంతో కీలకమని, చదువుపై ఏకాగ్రత పెట్టి పట్టుదలతో చదవాలన్నారు. జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు లక్ష్మణమూర్తి రూ.50 వేల విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో కళాశాల టాపర్లకు ప్రోత్సాహకంగా ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పట్టణంలో అమ్మకానికి ఉంచిన వినాయక ప్రతిమలు

పట్టణంలో గణపతి విగ్రహాల సందడి

బేతంచెర్ల: కులమతాలకు అతీతంగా జరుపుకునే వినాయకచవితి పండుగకు ప్రత్యేకత ఉంది. ఈనెల 27వ తేదీ నుంచి జరుపుకునే చవితి పండుగ సందర్భంగా ఆయా గ్రామాలు, పట్టణంలో నిర్వాహకులు, యువకులు విగ్రహాలు ఏర్పాటుకు చందాలు వసూలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే ఇప్పటికే విగ్రహాల కోసం తయారీదారులకు అడ్వాన్స్‌లు కూడా ఇచ్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన విగ్రహాలను విక్రయించేందుకు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని ఓ దుకాణంలో ఉంచారు. దీంతో పట్టణంలో వినాయక విగ్రహాల సందడి నెలకొంది. ప్రస్తుతం రూ.300 నుంచి రూ.30వేల విలువజేసే విగ్రహాలను విక్రయానికి ఉంచినట్లు అమ్మకందారులు తెలిపారు.

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామ బస్టాండ్ సమీపంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. సమీపంలోనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉండటంతో విద్యార్థులు తరచూ రాకపోకలు సాగిస్తుంటారని, ఏదైనా ప్రమాదం జరగకముందే ప్రధాన రహదారిపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



కౌసర్

ప్యాపిలి: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో ఫలితాల్లో 565 మార్కులు సాధించిన కౌసర్‌కు మూడో విడత కౌన్సెలింగ్‌లో ట్రిపుల్ ఐటీలో సీటు లభించిందని హెచ్‌ఎం సరళాదేవి శని వారం తెలిపారు. కౌసర్‌కు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు లభించిందని చెప్పారు. తమ కుమార్తెకు ట్రిపుల్ ఐటీలో సీటు లభించడంపై నిరుపేద కూలీలైన తల్లిదండ్రులు రెహమాన్, రేష్మా సంతోషం వ్యక్తం చేశారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

బేతంచెర్ల: మండలంలోని సీతారామాపురం గ్రామానికి చెందిన సంద్రబోయిన గంగయ్యను శుక్రవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన నాగమద్దయ్య, సాయి పాత మనస్పర్థలు మనస్సులో పెట్టుకొని కట్టెతో కొట్టి గాయపరిచారు. బాధితుడు సంద్రబోయిన గంగయ్య కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు శనివారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అవుకు: మండల సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన నొస్సం రాజేష్ పనుల నిమిత్తం ట్రాక్టర్‌లో బయలుదేరి వెళ్లగా ఊరి బయట పెద్దమ్మ కనుమ మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఇంజన్ మీద కూర్చున్న రాజేష్ కింద పడి స్పృహ తప్పాడు. వెంటనే అవుకు హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి నొస్సం సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: డీఆర్‌డీఏ వెలుగు సిబ్బంది డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పొదుపు భవనంలో కోవెలకుంట్ల డోన్ క్లస్టర్లకు సంబంధించి డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం, సీసీలు, ఐటీ స్త్రీనిధి ఉన్నతి తదితర పథకాల సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పీడీ మాట్లాడారు. అర్హత కలిగిన పొదుపు సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించేలా వెలుగు సిబ్బంది కృషి చేయాలన్నారు. తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని, బ్యాంకులకు తిరిగి చెల్లించేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి రుణాల రికవరీతో పాటు ఉన్నతి పథకం కింద తీసుకున్న రుణాల రికవరీ వంద శాతం పూర్తి చేయాలన్నారు.

పత్తాలేని పశువైద్యం

- వేధిస్తున్న పశువైద్యుల కొరత
- సకాలంలో పశువులకు అందని వైద్యం



కొలిమిగుండ్లలోని పశువైద్యశాల

కొలిమిగుండ్ల: బదిలీలపై వెళ్లిన అధికారుల స్థానంలో ఇంత వరకూ కొత్తగా ఎవరిని నియమించకపోవడంతో పశువైద్యశాలల్లో ఖాళీ ఏర్పడ్డాయి. కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లెలో పశువైద్యశాలలు ఉన్నాయి. కొలిమగుండ్లలో విధులు నిర్వహించే పద్మావతి లాంగ్‌లీవ్‌లో వెళ్లిపోయింది. ఆమె స్థానంలో అంకిరెడ్డిపల్లెలో పని చేసే వెటర్నరీ డాక్టర్ రమేష్‌బాబుకు కొలిమిగుండ్ల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన వెళ్లిపోవడంతో రెండు వైద్యశాలల్లో డాక్టర్లు లేకుండా పోయారు. మండలంలో పాడిపరిశ్రమపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. 56,900 గొర్రెలు,27,200 మేకలు,10,400 పాడి పశువులు ఉన్నాయి. ప్రస్తుతానికి బనగానపల్లె మండలం పసుపులలో విధులు నిర్వహించే డాక్టర్ రాంకుమార్‌రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన అంత దూరం నుంచి రెగ్యులర్‌గా వచ్చే అవకాశాలు అరుదుగా ఉంటాయి. పశువులకు ఏఆనారోగ్యం వచ్చినా చూసే వారు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని పాడిరైతులు వాపోతున్నారు. వర్షా కాలం కావడంతో గొర్రెలు, మేకలు,పశువులకు సీజనల్ వ్యాధులు సంభవిస్తుంటాయి. ఇలాంటి సమయంలో వైద్యులు లేక పోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రవేట్‌గా మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని రెండు పశువైద్యశాలలకు డాక్టర్లను నియమించాలని రైతులు కోరారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్ఆర్‌బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఆర్‌బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భూపాల్‌రెడ్డి రైతులకు సూచించారు. శనివారం యాగంటిపల్లె గ్రామ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ధనలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అన్నదాన సుఖీభవ–పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఏఓ సుబ్బారెడ్డి, కేవీకే ఏఓ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీలో మంటలు



మంటలు చెలరేగిన దృశ్యం

డోన్ టౌన్ : కొత్త బైకుల లోడుతో వెళుతున్న లారీలో మంటలు వ్యాపించి భయాందోళనకు గురి చేసిన సంఘటన శనివారం మండల పరిధిలోని ఉంగరానిగుండ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన లారీ బెంగళూరు నుంచి ముంబాయికి 40 కొత్త బైకుల లోడుతూ వెళ్తుండగా ఉంగరానిగుండ్ల గ్రామ సమీపంలోకి రాగానే క్యాబిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గమనించిన లారీ డ్రైవరు అప్రమత్తమై రోడ్డు పక్కన వాహనాన్ని ఆపి స్థానికుల సహాయంతో డోన్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. మంటల వ్యాపించిన సమయంలో జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనదారులు ఒకింత భయానికి లోనయ్యారు. ప్రమాదంలో లారీ క్యాబిన్ పూర్తిగా దగ్ధం కాగా.. ఆరు బైకులు పాక్షికంగా కాలిపోయినట్లు డోన్ ఫైర్ స్టేషన్ అధికారి రంగస్వామిగౌడ్ తెలిపారు. మొత్తం మీద రూ.10లక్షల నష్టం వాటిల్లిందని చెప్పారు.

మారని వంట ఏజెన్సీ



పాఠశాలకు ఐదుగురు చిన్నారులు హాజరైన దృశ్యం

బేతంచెర్ల: మండలంలోని కొమ్మూరి కొట్టాల గ్రామంలో మధ్యాహ్న భోజన పథకం పాత నిర్వాహకురాలిని తొలగించకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను శనివారం పాఠశాలకు పంపలేదు. 35 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో కేవలం ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు పాత నిర్వాహకురాలితోనే వంట చేయించారు. విద్యార్థులకు అరకొరగా భోజనం పెడుతున్న పాత నిర్వాహురాలు నాగలక్ష్మమ్మను తొలగించాలని..లేకపోతే తమ పిల్లలను బడికి పంపమని తల్లిదండ్రులు చెబుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కలెక్టర్, డీఈఓకు ఫిర్యాదు చేసినా స్థానిక అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కాల్వ కట్ట ఛిద్రం!

- కంకర లోడుతో టిప్పర్లు, ట్రాక్టర్లు రాకపోకలు
- ఉనికిని కోల్పోతున్న ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వ కట్ట



ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వ కట్టపై కంకర లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్

బనగానపల్లె: పట్టణం మీదుగా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు ఉన్న ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వ కట్ట భాగం ఒక వైపు ఛిద్రమవుతోంది. కంకర లోడ్‌తో ట్రాక్టర్లు, టిప్పర్లు ఇత్యం రాకపోకలు సాగిస్తుండటంతో కట్ట భాగం ఉనికిని కోల్పోతోందని ఈ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. బనగానపల్లె మీదుగా ఉన్న బత్తులూరుపాడు రహదారి నుంచి తెలుగుపేట వరకు ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వ కట్ట ఒక భాగంపై నిరంతరం కంకర లోడుతో కంకర ఫ్యాక్టరీల వాహనాలు రాకపోకలు సాగించడం నిబంధనలకు విరుద్ధం. ఈ విషయంలో చర్యలు తీసుకోవాల్సిన ఎస్ఆర్‌బీసీ అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఒక మారు కట్ట బీటలు వారి కొతకు గురై ప్రధాన కాల్వ సమీపంలోని పెండేకంటినగర్, ఆర్టీసీ బస్టాండ్, ఈద్గా నగర్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో నీరు చేరిన విషయం విధితమే. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వాహనాల రాకపోకలు నివారించి కట్ట భాగాన్ని పటిష్టపరచాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.